క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి



పెర్కిట్: అకాల వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల బారిన పడిన వారికి వైద్య సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేశ్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఉప కేంద్రంలో చిన్నారుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన చిన్నారులను గుర్తిస్తూ వారికి విధిగా వ్యాక్సినేషన్ చేసే విధంగా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు ఉపాధ్యాయుల సంఘీభావం



బాల్కొండ: పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మెండోరా మండల ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జైభారత్ అంటు నినాదాలు చేశారు. ఎంఈవో శ్రీనివాస్, వడ్నాల జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాల కోసం విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఈ రెండు గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లు మొదటి సంవత్సరంలో కేటాయించిందని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ బిల్లుల పై ఆందోళన వద్దు



బాల్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లులపై లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని ముప్కాల్ మండల ప్రత్యేకాధికారిణి స్రవంతి అన్నారు. శనివారం ముప్కాల్ మండలం రెంజర్లలో ఎంపీడీవో నరేశ్ ఆనంద్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో దశల వారిగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తోందని అన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగే కొద్దీ బిల్లులు మంజూరవుతాయని అన్నారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్ మొయినొద్దీన్, ఈవో నరేశ్, నాయకులు షరీఫ్, సర్జన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జి ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు సింగిరెడ్డి శేఖర్, బుచ్చిమల్లయ్య, పడిగెల ప్రవీణ్, రంజిత్, నిమ్మ ప్రసాద్, అవారి సత్యం, బోనగిరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



వర్ని: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని, అడవులను రక్షించడం వలన ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని వర్ని రేంజ్ అటవీ శాఖ అధికారి గంగాధర్ అన్నారు. శనివారం మోస్రా మండల కేంద్రంలో అడవుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విచ్చలవిడిగా అడవులను నరికి వేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు అటవీ సంపదను కాపాడాలని సూచించారు. మోస్రా సెక్షన్ ఆఫీసర్ కోటేశ్ యాదవ్, బీట్ ఆఫీసర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కాంటాల ఆలస్యంతో ఆందోళన

- అకాల వర్షాలతో దినదినగండంగా గడుపుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న వడ్లు
- కాంటాలు వేయాలని రైతుల వేడుకోలు



కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం



బాల్కొండ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

బాల్కొండ: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేసేందుకు ఆలస్యమవుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం త్వరగా అమ్మేందుకు ఎదురుచూస్తున్న రైతులు దినదిన గండంగా కాలం గడుపుతున్నారు. వడ్ల కాంటాలు కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు పేరుకు పోయాయి. ఇప్పటికి కాంటాలు చేపట్టడం లేదు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ధాన్యం మొలకెత్తుతోంది. దీంతో అన్నదాతలు మరింత ఆందోళన చెందుతున్నారు. హమాలీల కొరత, లారీల కొరత అంటూ నిర్వాహకులు, అధికారులు కాలం గడుపుతూనే ఉన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు దాటినా కాంటాలు చేయక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కాంటాలు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

అంతటా ఇదే పరిస్థితి..

ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలాల పరిధిలో అంతటా ఇదే పరిస్థితి ఉంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇది వరకే ధాన్యం సేకరణ పూర్తయింది. కానీ ఆలస్యంగా కోతలు కోసిన గ్రామాల్లో ధాన్యం కుప్పలు అలానే ఉండి పోయాయి. సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తామని ప్రకటించడంతో రైతులు అందరూ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు మొగ్గు చూపారు. దీంతో ధాన్యం ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకే వచ్చింది. కొనుగోలు కేంద్రాల్లో కావాల్సినంత హమాలీ, బస్తాలను, లారీలను అందుబాటులో ఉంచకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సమస్యను పరిష్కరించాలి



కొనుగోలు కేంద్రాల్లో వడ్లు వర్షాలతో మొలకెత్తుతున్నాయి. లైన్ రాలేదంటు నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రం చుట్టూ తిప్పుతున్నారు. వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలి. – సిరికంటి మహేశ్, రైతు, బాల్కొండ

నెల రోజులు అవుతోంది



కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి నెల రోజులు అవుతోంది. ఇప్పటి వరకు సంచులు కూడా నింపలేదు. హమాలీలు లేరంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. – బొంత రాములు, రైతు, కిసాన్‌నగర్

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు



బోధన్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆంధ్రయ్య



ఆర్మూర్‌లో ఆర్పీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోధన్/ కమ్మర్‌పల్లి/ బోధన్/ మాక్లూర్/ ఆర్మూర్‌టౌన్: ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాల పెంపు కోసం ఐదు రోజులుగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు శనివారం ముగిశాయి. బోధన్‌లోని ఇందూరు బీఈడీ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరానికి కలెక్టర్ వికాస్ మహతో హాజరై మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని, వారిలో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, హన్మాండ్లు, ఆర్పీలు సంజీవ్, శ్రీకాంత్, శ్రీహరిరెడ్డి, శ్రీధర్, పీరాజి, సీఆర్పీలు విజయ్, యూసుఫ్, బాబు, విజయ, దేవానంద్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరానికి ఎంఈవో ఆంధ్రయ్య హాజరై మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దా లని అన్నారు. రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, రవీందర్, వేణుగోపాల్, అశోక్, శంకర్‌గౌడ్, మారుతి, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూర జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి ఎంఈవో రాజీ మంజూష హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అశోక్, గగన్, అరుణ్‌కుమార్, ఆర్పీలు శ్రీదేవి, కృష్ణారెడ్డి, సాయిలు, మెర్లిన్, సీఆర్పీలు స్వర్ణ, వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న నవ్యభారతి కొనసాగుతున్న శిక్షణ శిబిరం ముగిసింది. ఆర్పీలు, ఉపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, మధుసూదన్‌రావు, ఆనంద్, మోహన్, ప్రదీప్‌కుమార్, సురేశ్, నరేశ్, రాంప్రసాద్, రాజన్న, వేణుగోపాల్‌రావు సంతోష్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరానికి మున్సిపల్ కమిషనర్ రాజు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. అనంతరం ఆర్పీలను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పీలు నరేశ్, సంతోష్, బ్రహ్మానందం, సురేశ్, ప్రవీణ్, లక్ష్మి, నారాయణ, చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందుత్వాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: హిందువులు ఐక్యంగా ఉంటూ ధర్మాన్ని, హిందుత్వాన్ని కాపాడుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలిసా శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. దేశంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని అందరు కలిసిమెలిసి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశంపై అందరికి జాతీయ భావం కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయం ఉందని, హనుమాన్ లేని ఊరులేదన్నారు. అలాగే పల్లిగుట్ట మంగిరాములు మహరాజ్ మాట్లాడుతూ.. కుంభమేళా, సరస్వతి పుష్కరాలు హిందువుల ఐక్యతకు నిదర్శనమన్నారు. పిల్లలకు ధర్మరక్ష పరిరక్షణ గురించి చెప్పాలని, భగవద్గీతను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో పురోహితుడు నంబి శ్రీనివాస్‌శర్మ, నాయకులు లోకభూపతిరెడ్డి, మందుల బాలు, పాలెపు రాజు, ఖాందేష్ ప్రశాంత్, పుప్పాల శివరాజ్, నల్లగొండ రాజేందర్, సత్యనారాయణగౌడ్ గడ్డం శంకర్, కొక్కెర భూమన్న, అరుణ్, రాజ్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

సమన్వయం కోసం చర్చించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ఆర్మూర్/ నందిపేట్: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కోసం చర్చించుకొని పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలోని మల్లయ్య మందిర మండపంలో ఆలూర్, మాక్లూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో అతిథి రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. నందిపేట మండల కేంద్రంలో నిర్వహించిన నందిపేట, డొంకేశ్వర్ మండలాల కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చైర్మన్ తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో చిన్న చిన్న సమస్యలు సాధారణమని, వాటిని నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్లు, యువకులకు పదవుల్లో అవకాశం కల్పిస్తుందని ఇది పార్టీ సిద్ధాంతమన్నారు. కార్యక్రమంలో మార చంద్రమోహన్, మంద మహిపాల్, భూమేశ్‌రెడ్డి, పెంట ఇంద్రుడు, మీసాల సుదర్శన్, పిప్పెర సాయరెడ్డి, మోర్తాడ్ బోజారెడ్డి, భరత్‌రెడ్డి, గాదారి గోపి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు



ఆర్మూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ కౌన్సిలర్



కమ్మర్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పెర్కిట్/ ఆర్మూర్‌టౌన్/ కమ్మర్‌పల్లి: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, ఆలూర్ మండలం దేగాంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని రెండవ వార్డులో శనివారం టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



పూజలు చేస్తున్న ఈరవత్రి రాజశేఖర్

పెర్కిట్: గంగమ్మ తల్లి ఆశీర్వాదంతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో విలసిల్లాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ఆకాంక్షించారు. ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామ శివారులో శనివారం వీడీసీ, గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమానికి రాజశేఖర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజశేఖర్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున వెల్మల్-ఆలూర్ బ్రిడ్జి



చిన్నపాటి వర్షానికి కోతకు గురైన బ్రిడ్జి కట్ట

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నందిపేట్: మండలంలోని వెల్మల్-ఆలూర్ గ్రామాల మధ్య గతేడాది నిర్మించిన బ్రిడ్జి ప్రమాదస్థాయికి చేరింది. బ్రిడ్జికి అనుకుని పోసిన మొరం చిన్నపాటి వర్షానికి కోతకు గురవుతోంది. బ్రిడ్జి నిర్మాణం రోడ్డుకు ఎత్తుగా నిర్మించడంతో రోడ్డు సమాంతరంగా ప్రయాణం చేసేందుకు మొరం పోశారు. కురుస్తున్న వర్షాలకు మొరం కొట్టుకుపోయి కోతకు గురవుతోంది. వర్షాలు ఉధృతంగా కురిస్తే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రయాణికులు సైతం బ్రిడ్జిపై ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

గతేడాది ఇలాగే బ్రిడ్జికి అనుకుని ఉన్న మొరం కోతకు గురైంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కాకముందే చిన్నపాటి వర్షాలకు కట్ట కోతకు గురవుతోంది. అధికారులు స్పందించి శాశ్వతమైన పరిష్కారాన్ని చేపట్టాలి. – బోగరాము, వెల్మల్

పూర్తి పనులు కాలేదు

వెల్మల్-ఆలూర్ గ్రామాల మధ్య బ్రిడ్జితో పాటు మండలంలోని మరికొన్ని బ్రిడ్జిల పనులు ఇంకా పూర్తిస్థాయిలో కాలేవు. పనులు తిరిగి చేపట్టి పూర్తి చేస్తాం. కోతకు గురైన చోట మరమ్మతులు చేపడతాం. త్వరలో శాశ్వత పరిష్కార దిశగా పనులు చేపడుతాం. – రఘు, ఏఈ, రోడ్డు భవనాల శాఖ

ప్రతిభావంతులుగా ఎదగాలి



విద్యార్థినులకు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

బోధన్: నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చుకుని ప్రతి విద్యార్థి ప్రతిభావంతులుగా ఎదగాలని సాలూర ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజీ మంజూష అన్నారు. విద్యాశాఖ అధ్వర్యంలో సాలూర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, యోగాను ప్రదర్శించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఉపాధ్యాయుడు స్వామి, సీఆర్పీ స్వర్ణ, వనజ, సౌమ్య, అవినాశ్, బాబు, సాయిలు పాల్గొన్నారు.



రుద్రూర్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

రుద్రూర్‌లో..

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. శిబిరంలో ఐదు నుంచి 9వ తరగతి విద్యార్థులకు యోగా, డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ నేర్పించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు నేర్చుకున్న యోగాసనాలు వేయడంతో పాటు వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట శ్రీనివాస్, యోగా మాస్టర్ విశ్వనాథ్ మహజన్, సాయిలు, రక్షిత, ప్రభాకర్, రిటైర్డ్ టీచర్ కేవీ మోహన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణం చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బోధన్‌టౌన్: శక్కర్‌నగర్ కాలనీ శ్రీరామ మందిరం వెనక ఉన్న రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని త్వరగా చేపట్టాలని వార్డు వాసులు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు వినతిపత్రం అందజేశారు. కల్వర్ట్ల పనులు నిలిచి పోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయ్ కిరణ్, సాగర్, కనకయ్య, లక్ష్మణ్, విజయ్‌కుమార్ తదితరలు ఉన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30

స్క్రీన్-4 శుభం(తెలుగు)-10.50, 7.55
ఏస్(తెలుగు)-1.30, 10.35
హిట్(తెలుగు)-4.40

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

తక్కువ యూరియాతో ఖర్చులు ఆదా



పడగల్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

వేల్పూర్: తక్కువ యూరియా వాడుతూ రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలని రుద్రూరు ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజు భార్గవి పేర్కొన్నారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో శనివారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవసరం మేరకే రసాయనాలు వాడి నేలతల్లిని రక్షించాలన్నారు. సాగు నీటిని ఆదా చేస్తూ, పంట మార్పిడి విధానంతో సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు. యూరియా అధికంగా వాడడంతో పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరగడమే కాకుండా పర్యావరణ కాలుష్యంతోపాటు పెట్టుబడి పెరిగిపోతుందని చెప్పారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. శాస్త్రవేత్త దుర్గారాణి మాట్లాడుతూ వర్షపు నీటిని కుంటల్లో నిల్వ చేయడంతో వానాకాలం పంట సాగు తర్వాత యాసంగి పంటలకు నీరు అందించడం సులభమవుతుందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, ఏవో శృతి, మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొంబాయి గంగాధర్, చిన్నారెడ్డి, వసంత్‌రావు, రాజ్‌ముత్యం, జాన్, రాజేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు



బోధన్‌టౌన్: బల్దియా పరిధిలోని నాలుగో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్ నాయక్ అన్నారు. శనివారం సబ్‌కలెక్టర్ వికాస్‌మహతోకు, కమిషనర్ వెంకటనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల జాబితాలో అనర్హులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని అన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉస్మాన్ ఖుద్దూస్, ఉదయ్ కిరణ్, సాగర్, కనకయ్య, లక్ష్మణ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.